8-10-2026_Layout 1 08-10-2026 19:18 Page 1



అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

గురువారం 8 అక్టోబర్ 2026 వరంగల్ సంపుటి: 20 సంచిక: 329 పేజీలు 05

- 'ఛలో లోక్‌భవన్'కు కాంగ్రెస్, టీజేఎస్, లెఫ్ట్ పార్టీలు
- పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఇండియా కూటమి రాష్ట్ర నేతల ఆందోళన
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- కీలక నేతలను అరెస్టు చేసిన పోలీసులు

ఉద్రిక్తత!





కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు 'ఛలో లోక్‌భవన్'కు కాంగ్రెస్, టీజేపస్, లెఫ్ట్ పార్టీలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతలకు దారితీసింది. లోక్‌భవన్ వద్ద ఆందోళనకు దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసనలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఇండియా కూటమి రాష్ట్ర నేతలు పాల్గొని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు. లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. లోక్‌భవన్ వైపుకు రానీయకుండా ఆందోళనకారులను బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉ ద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. - *అక్షరశక్తి, హైదరాబాద్*

ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి పలువురికి గాయాలు

డీసీఎం, కారును ఢీకొట్టిన ఇసుక లారీ

అక్షరశక్తి, ములుగు : ములుగు జిల్లాలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాయాలయ్యాయి. గోవిందరావుపేట మండలం పస్రా ఫారెస్ట్ చెక్ పోస్ట్ కు సమీపంలో జాతీయ రహదారిపై ఇసుక లారీ అదుపుతప్పి సిఆర్పిఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎం వ్యాన్ తో పాటు మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా పలువురు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి

రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత

అక్షరశక్తి, ఖానాపూర్ (నిర్మల్): నిర్మల్ జిల్లా ఖానాపూర్ రేంజ్ అటవిశాఖాధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. టింబర్ డిపో లైసెన్స్ రెన్యూవల్‌తో పాటు డిపోపై ఎలాంటి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయకుండా ఉండేందుకు సెక్షన్ అధికారి రవీందర్‌ను డిపో యజమాని సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం సెక్షన్ అధికారి రూ. 12 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.



8-10-2026_Layout 1 08-10-2026 19:18 Page 2



ఆయిల్‌పామ్ సాగు చేయాలి

ఎల్‌నినో పరిస్థితుల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అక్షరశక్తి, వరంగల్: ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, జిల్లాలో ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని అన్నారు. గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటల వైపు వెళ్లకుండా, నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్-పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై రైతులకు సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

కేయూలో చెట్ల నరికివేత

విద్యార్థుల ఆగ్రహం



అక్షరశక్తి, కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం రెండో గేటు సమీపంలో చెట్లను నరికివేస్తూ కొందరు పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. టీబీ ఆస్పత్రి ఎదురుగా వర్సిటీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై చెట్ల కింద అనుమతులు లేకుండా మొక్కల నర్సరీ నిర్వహిస్తున్నారని తెలిపారు. నర్సరీలోని మొక్కలకు ఎండ తగలడం లేదనే కారణంతో నీడనిచ్చే చెట్లను తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. చెట్లను పూర్తిగా నరికివేయకుండా ముందుగా సగం వరకు నరికి, ఆ ప్రాంతాన్ని సంచులతో కప్పివేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. కొంతకాలానికి చెట్లు ఎండిపోయిన తర్వాత సహజంగానే ఎండిపోయినట్లు చూపించి తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. నర్సరీలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలకు సూర్యరశ్మి అందడం లేదనే కారణంతోనూ చెట్లను ధ్వంసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొక్కలను పెంచే పేరుతో నర్సరీ నిర్వహిస్తూ, వాటికి ఆశ్రయమిస్తున్న పెద్ద చెట్లనే నరికివేయడం విరుద్ధ చర్య అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌పై నర్సరీ నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరు ఇచ్చారు? అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని విద్యార్థులు, పాదచారులు కోరుతున్నారు. ఉద్దేశపూర్వకంగా చెట్లను నరికివేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్యావరణానికి మేలు చేసే పెద్ద చెట్లను వ్యాపార ప్రయోజనాల కోసం ధ్వంసం చేయకుండా అధికారులు తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కో ఆప్షన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



అక్షరశక్తి, తొర్రూరు: మున్సిపాలిటీల్లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికంగా ఉన్నారనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని ఆరోపించారు. తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సీనియర్ నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్ల హక్కులను కాపాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాజీ సీఎం కేసీఆర్‌పై భూకబ్జాల ఆరోపణలతో కొత్త నాటకానికి తెరలేపుతోందని ఎర్రబెల్లి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రైతుబంధు, యూరియా, విద్యుత్, రుణమాఫీ, సాగునీరు, రైతుబీమా వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన రైతు, మహిళా సంక్షేమ పథకాలను కొనసాగించాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందిస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, రామిని శ్రీనివాస్, నల్లమాస ప్రమోద్‌కుమార్, హనుమండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, మనిరాజు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు భూసాని జయమ్మ, ధరావత్ పద్మ, కిన్నెర కవిత, తూర్పాటి రవి, జంపా, మాడుగుల భవానీలత తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ, కారు, మినీ వ్యాన్ ఢీ

పలువురికి గాయాలు

లారీ కిందికి దూసుకెళ్లిన కారు



అక్షరశక్తి, ములుగు: ములుగు జిల్లా పసర సమీపంలోని 163వ జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఫారెస్ట్ కాంటా హర్షి వద్ద లారీ, కారు, మినీ వ్యాన్ ఢీకొన్నాయి. ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా, ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు కారు లారీ కిందికి దూసుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు చిక్కుకుపోయారు. కారులో మహిళలు కూడా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను బయటకు తీసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ములుగు జిల్లాలో ఇసుక లారీల రాకపోకలతో రహదారులపై భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల వేగ నియంత్రణతో పాటు ప్రమాదకర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దాతృత్వమే నిజమైన మానవత్వం

బొల్లం నర్సయ్య 21వ వర్ధంతి సందర్భంగా 135 మందికి ఆహార పంపిణీ

అక్షరశక్తి, వరంగల్: వరంగల్ కు చెందిన బొల్లం నర్సయ్య 21వ వర్ధంతిని పురస్కరించుకుని బొల్లం రాజేష్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవీయతను చాటే సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి, మున్సిపాలిటీ పరిధి, రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆకలితో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయులను గుర్తించి 135 మందికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆకలితో ఉన్న వారికి అన్నం అందించడం ద్వారా బొల్లం నర్సయ్యను స్మరించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరాశ్రయులకు ఆప్యాయతను అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, నిరాశ్రయులు ఆహారం అందించిన సేవా సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఛైర్మన్, సామాజిక కార్యకర్త, రచయిత బొల్లం రాజేష్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలను కేవలం ఒకరోజుకే పరిమితం చేయకుండా రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, అభాగ్యులు, నిరాశ్రయులు, ఆపదలో ఉన్న వారికి సంస్థ ద్వారా అండగా నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బస్వారాజు చందర్, బస్వారాజు రంజిత్, ఇట్టబోయిన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

8-10-2026_Layout 1 08-10-2026 19:18 Page 3





టిబి ముక్త్ భారత్‌లో యువత భాగస్వాములు కావాలి

అక్షరశక్తి,వరంగల్: టిబి ముక్త్ భారత్ సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకుగా భాగస్వాములు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన 'టిబి ముక్త్ భారత్--ఆయుష్మాన్ కోసం జోష్ టీముల' కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చూడాలన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. చికిత్స పొందని టిబి రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా వ్యాధి ఇతరులకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. లక్షణాలు ఉన్నవారు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కఫ పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందన్నారు. మందులను మధ్యలో నిలిపివేయడం వల్ల డ్రగ్ రెసిస్టెంట్ టిబి వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై ప్రత్యేక అప్రమత్తత అవసరమన్నారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానితులను గుర్తించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించిన గ్రామాల సర్పంచులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. చాపలబండ సర్పంచ్ ఆలేటి పశు, దేశాయిపల్లి సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి, చెన్నారం సర్పంచ్ సింధం లలిత, కాశిగూడెం సర్పంచ్ పటాన్ రాజాక్, లోహిత సర్పంచ్ బొమ్మ నాగేష్, నల్లబెల్లి సర్పంచ్ జక్క అనిత తరఫున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్లు అందుకున్నారు. అనంతరం టిబి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, వైద్య సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో విజయదశమి మహోత్సవాలు



అక్షరశక్తి,హనుమకొండ: సాయిబాబా మందిరంలో ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విజయదశమి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు మందిర ధర్మకర్తల మండలి తెలిపింది. మహోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ప్రవాస భారతీయుడు అనిల్ రెడ్డి, ధర్మకర్తలు వెయ్యి గండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్ తదితరులు ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే విజయదశమి మహోత్సవాలను భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు వివిధ ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని సాయినాథుని ఆశీస్సులు పొందాలని కోరారు. విజయదశమి రోజున సాయంత్రం 7 గంటలకు సాయిబాబా మందిరంలో ప్రత్యేకంగా షమీ పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహోత్సవాల్లో పాల్గొనే భక్తులకు బాబా తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సాయిబాబా మహాసమాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ధర్మకర్తల మండలి పిలుపునిచ్చింది.

సబ్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ

అక్షరశక్తి,హనుమకొండ: హనుమకొండ సర్కిల్ పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 132/32 కేవీ భీమదేవరపల్లి సబ్‌స్టేషన్‌ను టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించి, వినియోగదారులు ఎదుర్కొంటున్న వోల్టేజ్ హెచ్చుతగ్గులు, తక్కువ వోల్టేజ్, ఫీడర్ల పనితీరు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వోల్టేజ్ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి లోడ్ బ్యాలెన్సింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం, ఫీడర్లపై లోడ్ పరిస్థితిని పర్యవేక్షిస్తూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎండీ ఆదేశించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, ఇతర విద్యుత్ పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించి, లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తెలుసుకుని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. సీఎండీ వెంట హనుమకొండ ఎస్ఈ సామ్య నాయక్, ఏడీఈలు వంశీ, రాజేశ్వర్ రావు, ఏఈ లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పింగిళి డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

అక్షరశక్తి,హనుమకొండ: పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సాంస్కృతిక విభాగం, ఎన్ఎస్ఎస్ మొదటి, రెండో, మూడో యూనిట్ల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వరంగల్-1 ఆర్టీసీ డిపో మేనేజర్ పుప్పాల అర్పిత ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో యువత పాత్ర కీలకమని ఆమె అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులు తంగేడు, గునుగు, మందారం, మల్లె, గుమ్మడి తదితర పూలతో



రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ డా. ఆర్. లక్ష్మీకాంతం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కవిత, డా. రామా రత్నమాల, డా. వి. మమత నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. వివిధ విభాగాలు రూపొందించిన బతుకమ్మల పోటీలో చరిత్ర విభాగం ప్రథమ, సోషల్ సైన్సెస్ విభాగం ద్వితీయ, ఎన్‌సీసీ విభాగం తృతీయ స్థానాలు సాధించగా, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ విభాగాలకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. న్యాయ నిర్ణేతలుగా హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డా. కోమల, డా. కవిత వ్యవహరించారు. విజేతలకు పుప్పాల అర్పిత, ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, డా. ఆర్. లక్ష్మీకాంతం, ఎన్ఎస్ఎస్ అధికారులు కవిత, డా. రత్నమాల, డా. మమత, న్యాయ నిర్ణేతలు డా. కోమల, డా. కవిత బహుమతులు అందజేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

8-10-2026_Layout 1 08-10-2026 19:18 Page 4





బాలగోపాల్ రచనలు నేటి తరానికి దిక్సూచి

విలువలు, మానవ సంబంధాలపై విద్యార్థులు ఆలోచించాలి

ప్రొఫెసర్ జి. హరగోపాల్

అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 8: మానవ సంబంధాలు, విలువలు క్రమంగా విధ్వంసమవుతున్న తీరుపై విద్యార్థులు ఆలోచించాలని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, విద్యావేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్‌హాల్‌లో గురువారం వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ కే. బాలగోపాల్ 16వ స్మారక ఉపన్యాసం నిర్వహించారు. బాలగోపాల్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం 'బాలగోపాల్ రచనల ప్రాసంగికత' అంశంపై హరగోపాల్ ప్రసంగించారు. విలువలు మానవ అభివృద్ధికి, నాగరికతకు కీలకమని, అయితే ప్రస్తుత సమాజంలో అవి క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం బాలగోపాల్ ఆలోచనలకు కేంద్రబిందువులని పేర్కొన్నారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని ఆయన బలంగా విశ్వసించారని తెలిపారు. హక్కులు వ్యక్తి కేంద్రంగానే కాకుండా సమాజ కేంద్రంగా కూడా ఉండాలని, మానవ హక్కులకు సార్వజనీన ప్రమాణాలు అవసరమని అన్నారు. సిద్ధాంతం, ఆచరణ మధ్య సమన్వయం ఉండాలని, విద్యార్థులు బాలగోపాల్ విలువలను చదవడానికే పరిమితం కాకుండా ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. హెచ్ఆర్ఎఫ్ కార్యకర్త తాల్లా రోహిత్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితమే బాలగోపాల్ మానవ హక్కుల పరిరక్షణకు అంకురార్పణ చేశారని అన్నారు. సంక్షేమం భిక్ష కాదని, ప్రతి పౌరుడి హక్కు అని బాలగోపాల్ తన రచనల ద్వారా చాటారని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల్లో నిర్వాసితుల హక్కులు, జీవనోపాధి, గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన చెప్పేవారని తెలిపారు. న్యాక్ మాజీ సంచాలకులు ఆచార్య వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ బాలగోపాల్ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడని అన్నారు. ఆయన స్మారకంగా 'పర్స్పెక్టివ్స్' సంస్థ ద్వారా ఆలోచనలు, రచనలు, ప్రసంగాలను పుస్తకరూపంలో తీసుకొస్తున్నట్లు తెలిపారు. వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బాలగోపాల్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని, ఆయన పేరిట ఇప్పటివరకు 16 స్మారక ఉపన్యాసాలు నిర్వహించినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ బాలగోపాల్ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు కావడం గర్వకారణమన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. అనంతరం 'నిత్య జీవితంలో మానవ హక్కులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలగోపాల్ సతీమణి వసంతలక్ష్మి, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పీఆర్వో డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల సంయోజకులుగా వ్యవహరించారు.

సన్నబియ్యంతో పేదల ఆకలి తీరుస్తున్నాం

అక్షరశక్తి, పరకాల, అక్టోబరు 8: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల 19వ వార్డు కౌన్సిలర్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. పరకాల పట్టణంలోని 19వ వార్డులో కొత్త రేషన్‌కార్డులు, డిజిటల్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయడంతో పాటు పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కార్డుల్లో పిల్లల పేర్లు కూడా నమోదు చేయలేదని విమర్శించారు. ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ, నీడ కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీధర్, సురేష్, షఫీ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును కాపాడుకోవాలి

అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 8: ఓటు హక్కు పరిరక్షణకు విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం--పార్లమెంటరీ ప్రజాస్వామ్యం--ఓటు హక్కు' అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ సెమినార్‌హాల్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల తొలగింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటర్ల జాబితాలో అనర్హుల తొలగింపుతో పాటు అర్హుల హక్కులు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలనే ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ మాట్లాడారు. మహమ్మద్ ఖాన్, పీడీఎస్‌యూ నాయకులు వంగేటి మోహన్, అఖిల్, రాజేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ మొహమ్మద్ ఆజమ్ అలీకి డా. బి.వి. పట్టాభిరామ్ స్మారక జాతీయ అవార్డు

అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబరు 8: వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మొహమ్మద్ ఆజమ్ అలీకి డా. బి.వి. పట్టాభిరామ్ స్మారక జాతీయ అవార్డు లభించింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఏ. కరీం, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖి సంయుక్తంగా అందజేశారు. గత 15 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, భాషా నైపుణ్య తరగతులు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఆజమ్ అలీ.. 'చమక్ ఫౌండేషన్' ద్వారా వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నారు. యువతను సానుకూల దృక్పథంతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని ఆజమ్ అలీ అన్నారు. తన గురువు డా. బి.వి. పట్టాభిరామ్ పేరుతో అవార్డు అందుకోవడం జీవితంలో మరువలేని ఘట్టమన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరకాల ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

అక్షరశక్తి, పరకాల, అక్టోబరు 8: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలోని నూతన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ మేల్, ఫిమేల్ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, గర్భిణుల యాంటీనాటల్ వార్డు, లేబర్ రూమ్, పోస్టు నాటల్ వార్డుతో పాటు మొదటి అంతస్తులోని గదులను పరిశీలించారు. వివిధ విభాగాలకు కేటాయించాల్సిన గదులు, కల్పించాల్సిన వసతులపై వైద్యులు, అధికారులతో చర్చించారు. ఆశా కార్యకర్తలు గర్భిణుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆస్పత్రి పక్కన నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఆస్పత్రి అవసరాలకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. ఆయా విభాగాల పేర్లతో సైన్‌బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. ఫిజియోథెరపీ, బ్లడ్‌బ్యాంక్ తదితర విభాగాలకు అనుగుణంగా గదులు కేటాయించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి ముందు ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని, బాక్స్ డ్రెయిన్ నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, ఆర్ఎంవోలు డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ నందూ పటేల్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ డీఈ లోరిన్, వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



8-10-2026_Layout 1 08-10-2026 19:18 Page 5



అవయవదానంపై అపోహలు వీడాలి

జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షుడు పరకాల రవీందర్‌రెడ్డి

అక్షరశక్తి, మహబూబాబాద్, అక్టోబరు 8: అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షుడు లయన్ పరకాల రవీందర్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ మాన్యత ఆధ్వర్యంలో నేత్ర, రక్త, అవయవ, మరణానంతర శరీరదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు వేలూరి శ్యామలాదేవి అధ్యక్షతన మానుకోట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అవయవదానం ద్వారా పలువురికి ప్రాణదానం చేయవచ్చని వివరించారు. నేత్రాలు, అవయవాలతో పాటు మరణానంతరం మృతదేహాన్ని వైద్య విద్యకు దానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి అంగీకార పత్రాలను అందజేశారు. ఆలయ వాచ్‌మన్ జాటోత్ భద్రు మరణానంతరం తన శరీరాన్ని మహబూబాబాద్ మెడికల్ కాలేజీకి దానం చేసేందుకు అంగీకార పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బండి అరుణ, ట్రెజరర్ పరకాల కళావతి, సభ్యులు రంగవజ్జుల సునీత, వడ్డేపల్లి సునీత, పరకాల లక్ష్మి, రూపిరెడ్డి శ్రీలత, కైరంకొండ విజయ, ఏ. స్వర్ణ, కైరంకొండ లలిత, జిల్లా వాణి, పరకాల శ్రీదేవి, కే. సజితాదేవి, పరకాల పద్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేత ఆపాలి

కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను దగా చేస్తోంది : మర్రి యాదవ్‌రెడ్డి



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 8: పేదల ఇళ్ల కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రకాళి ఆలయం వెనుక చరబండ్ల రాజుల కాలనీలో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే దళితులు, పేదలపై చర్యలకు దిగుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ ఇళ్లను కూల్చివేసి ఉంటే అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని అన్నారు. ఘటనపై ప్రభుత్వం తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. నాయిని రాజేందర్‌రెడ్డి ప్రమేయంతో అక్రమ కేసులు నమోదయ్యాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మాజీ కార్పొరేటర్ జోరికే రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేస్తే కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. వరంగల్ నగర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలే అంతిమ నిర్ణేతలని అన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

అక్షరశక్తి, చిట్యాల, అక్టోబరు 8: మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలని చిట్యాల ఎస్ఐ పి. సతీష్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. యుగంధర్ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీదేవి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు లోనుకాకుండా సమాజంలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత యూనిఫార్మ్‌లను ఎస్ఐ సతీష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల తరఫున సహకరిస్తామని ప్రిన్సిపాల్ బి. శ్రీదేవి తెలిపారు. యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంచేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. యుగంధర్ అన్నారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

అక్షరశక్తి, పరకాల, అక్టోబరు 8: బతుకమ్మ ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలోని దామెర చెరువు, అంగడి మైదానాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు బండి శ్రీధర్, అల్లె దశరథం, కుక్కల విజయ్, ఏఈ ప్రవీణ్‌కుమార్, టీపీఎస్ రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

అక్షరశక్తి, భూపాలపల్లి, అక్టోబరు 8: వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు పెరుగు రమేష్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్‌కుమార్ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన అక్కపెల్లి మల్లయ్య (38) 2020 సెప్టెంబరు 4న అకినేపల్లి గ్రామంలోని కాకతీయ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.50 వేల నగదు డ్రా చేశాడు. ఈ విషయం గమనించిన పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన పెరుగు రమేష్ (26) నగదు దోచుకోవాలనే ఉద్దేశంతో మల్లయ్యను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం కొనుగోలు చేసి వ్యవసాయ బావి వద్ద ఇద్దరూ మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న మల్లయ్య తలపై బండరాయితో కొట్టి హత్య చేసి, రూ.50 వేల నగదు తీసుకుని మృతదేహాన్ని బావిలో పడేసినట్లు పోలీసులు తెలిపారు. మల్లయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నిహారిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి చిట్యాల సీఐ ఎం. సాయి రమణ దర్యాప్తు కొనసాగించి రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ బి. రాజు పర్యవేక్షణలో కోర్టు లైజనింగ్ అధికారి జి. వెంకన్న, ఏఎస్ఐ, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు ఛ. జ్యోతి, పి. శ్వేత సాక్షులను కోర్టుకు హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత భూపాలపల్లి డీఎస్పీ ఎ. సంపత్‌రావు, చిట్యాల సీఐ సతీష్, ఎస్ఐ సురేష్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ బి. రాజు, జి. వెంకన్న, ఛ. జ్యోతి, పి. శ్వేతలను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ అభినందించారు.

ట్రూ-అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



అక్షరశక్తి, హన్మకొండ, అక్టోబరు 8: విద్యుత్ ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నవంబరు నుంచి ట్రూ-అప్ ఛార్జీల పేరుతో రూ.5,420 కోట్లకు పైగా అదనపు భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని అన్నారు. నవంబరులో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబరు నుంచి 50 పైసల చొప్పున అదనపు భారం వేయడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ భారం మోపడం దుర్మార్గమన్నారు. డిస్కంల నిర్వహణ లోపాలు, విద్యుత్ కొనుగోలు వ్యయాల భారాన్ని వినియోగదారులపై మోపకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.